క్లుప్తంగా

దాడిచేసిన ఇరువురికి జైలు, జరిమానా

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో ఇరువురు వ్యక్తులు ఓ యువకుడిపై దాడిచేసి గాయపరచిన ఘటనలో చిలకలూరిపేట ఏజేసీజే న్యాయస్థానం ముద్దాయిలకు మూడు నెలల జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి స్వాతి తీర్పు వెలువరించారు. నాదెండ్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు 2018లో కనపర్రు గ్రామానికి చెందిన చీరాల అరవింద్ సాయిని అదే గ్రామానికి చెందిన చెవుల నరేంద్ర, చెవుల నాగాంజనేయులు దాడి చేసి గాయపరిచారు. అప్పటి ఎస్సై కొమ్మాలపాటి చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు. గురువారం న్యాయస్థానం ముద్దాయిలకు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పుచెప్పింది. ఏపీపీగా కె.జ్యోతి వ్యవహరించారు.

అర్హత ఉన్న రైతులకు అన్నదాత సుఖీభవ పథకం

శావల్యాపురం: అర్హత కల్గియున్న రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చర్యలు చేపట్టినట్లు ఏవో రామినేని రామారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏవో రామారావు మాట్లాడుతూ మండలంలోని ఏడు రెవెన్యూ గ్రామాల పరిధిలో 12.559 రైతులకు సంబంధించిన రికార్డులు ఉన్నాయని వీరందరూ రైతుసేవా కేంద్రాలను సంప్రదించి ఆప్రూవల్ చేయడానికి ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లను అందజేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. అప్రూవల్ కాగానే ప్రభుత్వం నుంచి నేరుగా సంబంధిత రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నగదు జమ అవుతుందన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు



బొల్లాపల్లి: ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యంను పరిశీలించి రసాయనిక పరీక్షకు శాంపిల్ బాటిల్‌ను సేకరించారు. దుకాణాల్లోని మద్యం ధరలను నిర్ధారించుటకు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను దుకాణాదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటి ఆంజనేయస్వామి దేవస్థాన చైర్మన్‌గా గజవల్లి



వినుకొండ: పట్టణంలోని గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా గజవల్లి నాగపవన్‌కుమార్‌ను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు సన్మానించారు. వాసవీ క్లబ్స్, విశ్వహిందూ పరిషత్, రెడ్‌క్రాస్ తదితర సంస్థల ప్రతినిధులు, సభ్యులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగవతుల రవికుమార్, గట్టుపల్లి శ్రీనివాసరావు, చిలంకూరి కోటేశ్వరరావు, పొత్తూరి రాము, అప్పలరాజా, బెల్లంకొండ ప్రసాద్, గర్రె అనిల్, జీవీఎల్ నాగేశ్వరరావు, కాసుల రవీంద్ర పాల్గొన్నారు.

98 మందికి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్



రొంపిచర్ల: అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా మండలంలోని వి.రెడ్డిపాలెంలో గల విప్పర్ల పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలు గురువారం ముగిశాయి. అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ శిబిరంలో మొత్తం 98 మంది పెద్దలకు, పిల్లలకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేశామని సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి వై. మహేష్ కుమార్ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి ఎం. వెంకటరమణ ఆదేశాల మేరకు అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాలలో జీడీసీసీ బ్యాంక్ సంతగుడిపాడు బ్రాంచ్ మేనేజర్ ఎం.కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ బి. వెంకటేశ్వర్లు, డీఏ శ్రీకాంత్, సొసైటీ అధికారులు ఎస్.లక్ష్మీరెడ్డి, ఎస్. వీరారెడ్డి, సిబ్బంది వై. లక్ష్మారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



గణపవరంలో ఆరబెట్టిన మిర్చిపై కప్పిన టార్పాలిన్ పట్టలు



గణపవరంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ఈదురు గాలులకు తోడైన భారీవర్షం!

- పొలాల వైపునకు రైతుల పరుగులు
- అరగంటపాటు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు

నాదెండ్ల: అకాల వర్షం రైతులను పరుగులు పెట్టించింది. బుధ, గురువారాల్లో మధ్యాహ్న సమయంలో సుమారు అర్ధగంటకు పైగా కురిసిన భారీ వర్షానికి మిర్చి, పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో భారీ వర్షం కురవటంతో కల్లాల్లో ఆరబోసుకున్న మిర్చిని కాపాడుకునేందుకు రైతులు పట్టలు కప్పారు. పొగాకు కొనుగోళ్ళు మందగించటంతో రైతులు ఇళ్ల వద్దనే మెట్టుకట్టి నిల్వ చేశారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో పొగాకు తడిచింది. అసలే పొగాకు ధరలు పతనమై అల్లాడుతున్న క్రమంలో వర్షానికి పొగాకు తడవటంతో కొనుగోలు చేసే వారుండరని రైతులు వాపోతున్నారు.

ఈదురుగాలులకు ఒరిగిన విద్యుత్ స్తంభాలు

భారీ వర్షం, ఈదురు గాలుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మేజర్ పంచాయతీ గణపవరంలో సీఆర్ కళాశాల పక్కనే ఎంవీఆర్ కంపెనీ ఎదురుగా ఉన్న 33 కేవీ విద్యుత్ లైను స్తంభంపై 11 కేవీ లైను స్తంభం ఒరిగింది. దీంతో గ్రామంలో సుమారు మూడు గంటల పాటూ విద్యుత్ స్తంభించింది. విద్యుత్‌శాఖ సిబ్బంది అప్రమత్తమై ఒరిగిన స్తంభాన్ని యథాస్థానంలో నిలిపి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అన్నవరం చుట్టుప్రక్కల గ్రామాల్లో భారీ వర్షం కురవగా, రొంపిచర్ల, వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు తదితర గ్రామాల్లో కొద్దిమోస్తరు వర్షపు జల్లులు పడ్డాయి. సాయంత్రవేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమైంది. పెద్ద పెద్ద ఉరుములు ఉరిమాయి. గాలులు వీచాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో మండల ప్రజలు గ్రీష్మతాపం నుండి ఉపశమనం చెందారు.

దెబ్బతిన్న నివాసాల పరిశీలన

యడ్లపాడు: భీకర ఈదుర గాలులకు దెబ్బతిన్న నివాసాలను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని సంగంగోపాలపురం గ్రామంలో బుధవారం రాత్రి వీచిన గాలుకు రేకులు ఇళ్లు రెండు దెబ్బతిన్నాయి. దీంతో తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, సిబ్బందితో వెళ్లి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ప్రకృతి విపత్తు కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. నష్టం వివరాలను బాధిత కుటుంబాల నుంచి సేకరించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలతో పాటు టీడీపీ నాయకులు మద్దూరి శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు ఉన్నారు.



గోపాలపురంలో పరిశీలనకు వచ్చిన తహసీల్దార్ జెట్టి విజయశ్రీ

కచ్చితమైన తూకంతో సరుకులు విక్రయించాలి

జిల్లా లీగల్ మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ శంకరరావు

చిలకలూరిపేట: ప్రతి వర్తకుడు వినియోగదారులకు ఖచ్చితమైన తూకం ప్రకారం సరుకులు విక్రయించాలని పల్నాడు జిల్లా లీగల్ మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ శంకరరావు చెప్పారు. ప్రపంచ మెట్రాలజీ దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని రైతు బజార్లో వినియోగదారులు, వర్తకులకు లీగల్ మెట్రోలజీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్తకులు వినియోగించే తూకాల కాటాలను సంవత్సరానికి ఒకసారి లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ చేయించుకోవడం తప్పనిసరి. అలా చేసిన వారికే సంబంధిత సర్టిఫికెట్ జారీ అవుతుదని వివరించారు. విజిలెన్స్ కమిటీ మెంబర్ పిల్లి యజ్ఞనారాయణ మాట్లాడుతూ, వినియోగదారులు సరుకులు కొనుగోలు చేసే వేళ తూకం సరైందేనా అనే విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ తూకం ఇచ్చినట్లు అనుమానం వచ్చినపుడు అధికారులను, రైతుబజారు మేనేజర్‌ను, వినియోగదారుల సంఘాలను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు.

అనంతరం, రైతు బజారులో వ్యాపారం చేస్తున్న వర్తకులకు సరుకులు తూకం వేయడం, కాటా వాడకంపై వివరణ ఇచ్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఇంచార్జ్ మురికిపూడి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ విక్రమ్, రైతుబజార్ ఎస్టేట్ మేనేజర్ ఖాజ తదితరులు పాల్గొన్నారు.



తూకాలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులలో సామాజిక సేవా దృక్పధాన్ని పెంపొందించేందుకు రెడ్‌క్రాస్ దోహదపడుతుందని వాగ్దేవి విద్యాసంస్థల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాగ్దేవి జూనియర్ కళాశాలలో గురువారం పల్నాడుజిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీడూన్ హంట్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. ఈసందర్భంగా రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులు సమయంలో ప్రపంచ వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. విద్యార్థులు రెడ్‌క్రాస్ వాలంటీర్లుగా సామాజిక సేవలో భాగస్వాములు కావాలని హితవు పలికారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డాక్టర్ కె.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందచేస్తారనీ, విద్యార్థులు వాటిని గ్రేస్ పాయింట్లకు ఉపయోగించుకోవచ్చని వివరించారు. కాగా, ఉచిత వైద్య శిబిరంలో చెవి, ముక్కు పరీక్షలను డాక్టర్ జగన్మోహనరెడ్డి, దంత సమస్యల పరీక్షలను డాక్టర్ రహంతుల్లా, కంటి పరీక్షలను డాక్టర్ సృజన నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కూరపాటి గుప్త, జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయల శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ట

శావల్యాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో నూతనంగా మహాగణపతి, శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి, శివలింగ, నందీశ్వర, నాగేంద్రస్వామి, విగ్రహ ప్రతిష్టా వేడుకలు గురువారం ఉదయం 9.36 నిమిషాలకు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి దమ్మాలపాటి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో దేవాలయం పునః నిర్మాణ పూర్తి చేశామన్నారు. వేద పండితులు బ్రహ్మశ్రీ అయినాల నాగేశ్వరరావు ఆచారి, కడియాల ఆంజనేయ శాస్త్రి, సొలస శివయ్య శాస్త్రి వేదమంత్రాల నడుమ ప్రతిష్టా వేడుకలు వైభవంగా ముగిసినట్లు తెలిపారు. నియోజకవర్గ శాసన సభ్యులు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు, తదితరులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన సంతర్పణ కూడా ఏర్పాటు చేశారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి

చిలకలూరిపేట: ప్రతి ఒక్క రోగి పట్ల స్నేహభావంతో వ్యవహరించి, మెరుగైన వైద్యసేవ అందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. గురువారం పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిని సందర్శించారు. ఆకస్మిక తనిఖీతో ఆసుపత్రిలో హడావుడి వాతావరణం నెలకొంది. నేరుగా రోగులతో మాట్లా డి, వైద్య సేవల స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల పనితీరు, సిబ్బంది స్పందనపై ప్రజాభిప్రాయాలను స్వయంగా అడిగి తెలుసుకున్న ఆయన, సేవల స్థాయిని మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సూచించారు. హాస్పిటల్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారితో నిధుల సమన్వయంపై చర్చించి, సమస్యలు వెంటనే పరిష్కరించాల్సిందిగా సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని వైద్యసిబ్బందికి ఆదేశించారు. ముఖ్యంగా అవసరమైన మందులు, ఇతర వనరులు ముందస్తుగా సిద్ధంగా ఉంచాలని, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులపై బాధ్యతతో వ్యవహరించాలని హితవు పలికారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీపతి శ్రీహరి, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, మురకొండ మల్లిబాబు, గట్టినేని రమేష్, మారెళ్ళ ఇందిరా ఉన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఈశ్వర్‌లో వ్యాయామశాల ప్రారంభం

నరసరావుపేటరూరల్: విద్యతో పాటు శారీరక దారుఢ్యంపై విద్యార్థులు దృష్టిపెట్టాలని విద్యుత్ శాఖ ఏఈ కె.రాంబాబు తెలిపారు. కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ లో గురువారం వ్యాయమశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన రాంబాబు మాట్లాడుతూ కళాశాలలో ఏర్పాటుచేస్తున్న వ్యాయామశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శారీరక దృఢత్వాన్ని, మానసిక ప్రశాంతతను పెంపొందించుకునేందుకు వ్యాయామశాల దోహదం చేస్తుందని తెలిపారు. కళాశాల ఛైర్మన్ షేక్ మీరావళి మాట్లాడుతూ వ్యాయామశాలలో అధునాతన సదుపాయాలను కల్పించినట్టు తెలిపారు. విద్యార్థులకు కేటాయించిన సమయాల్లో ఉపయోగించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి షేక్ కరీం మోహిద్దీన్, డైరక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, వ్యాయామ అధ్యాపకుడు హెచ్.గంగాధర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఏఈ రాంబాబు

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

వినుకొండ: ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని శివయ్య భవన్‌లో గురువారం సార్వత్రిక సమ్మె సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెను ఉభయ కార్మిక సంఘాలు, రైతు సంఘాలు విజయవంతం చేయాలని కోరారు. సమ్మె విజయవంతం కోసం కరపత్రాల పంపిణీ, మైక్ ప్రచారం చేపట్టాలని తెలిపారు. సమ్మె విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 17న జరిగే మోటారు సైకిల్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, హనుమంతరెడ్డి, బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, బొంకూరి వెంకటేశ్వర్లు, వెంకటప్పయ్య, పఠాన్ లాల్‌ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

భూసార పరీక్షలతో రైతులకు మేలు

నూజెండ్ల: భూసార పరీక్షల కోసం నిర్దేశించిన లక్ష్యం మేరకు మట్టి నమూనాలు సేకరించాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు, తలార్లపల్లె రైతు సేవా కేంద్రాల పరిధిలో సిబ్బంది చేపడుతున్న మట్టి నమూనాల సేకరణను ఆమె తనిఖీ చేశారు. మట్టి నమూనాలతో పాటు రైతుల వివరాలు, పంటల సాగు ఎప్పటికప్పుడు సాయిల్ హెల్త్ కార్డు యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మాట్లాడుతూ భూసార పరీక్షలతో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక నేలలకు భూసార పరీక్షల ఫలితాల ఆధారంగానే రైతులకు రాయితీపై సూక్ష్మపోషకాలను పంపిణీ చేస్తామని తెలిపారు. నేల ఆరోగ్య పత్రం ప్రతి రైతు వద్ద ఉండాలని ఆమె సూచించారు. ఆమె వెంట ఎలీషా, బి.అప్పారావు, తేజస్వి ఉన్నారు.



మట్టి నమూనాల సేకరణ పరిశీలిస్తున్న డీడీఏ శివకుమారి

పెండ్లి కుమారుడిగా రంగనాథుడు

- అట్టహాసంగా కల్యాణోత్సవాలు ఆరంభం
- సొలస గ్రామంలో ఆధ్యాత్మిక శోభ

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామం ఆధ్యాత్మిక కళతో శోభిల్లింది. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భూసమేత రంగనాయకస్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గురువారం నుంచి వారంరోజులు జరిగే స్వామివారి కల్యాణోత్సవాలు గ్రామపెద్దలు, ధర్మకర్తలు సమన్వయంతో వైభవోపేతంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ సందర్భంగా ఆలయానికి కొత్తరంగులు, షామియానాలు, విద్యుద్దీపాలంకరణ చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా వేకువజామునే ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యుల నేతృత్వంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, అనంతరం విశేష అలంకరణలు చేశారు. మహిళలు మేళతాళాలు, బాజాభజంత్రీలు నడుమ ఆలయ ప్రాంగణంలో భక్తి కీర్తనలు ఆలపిస్తూ పసుపు కొట్టుడు, మెహందీ వంటి సంప్రదాయ కార్యక్రమాలతో ఉత్సాహంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్ దంపతులు, అర్వపల్లి బ్రదర్స్ స్వామివారికి నూతన పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం రంగనాథుడిని పెండ్లికుమారుడిగా, శ్రీదేవి, భూదేవిలను పెళ్లి కుమార్తెలుగా సర్వాంగ సుందరంగా అలంకరణ చేశారు. సాయంత్రం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణ వంటి క్రతువులు నిర్వహించి పలు రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. స్థానికులే కాకుండా సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన ఈవో, గ్రామపెద్దలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయానికి విద్యుత్ దీపాలంకరణ గావించారు.



పసుపు దంచుతున్న భక్తులు



పెండ్లికుమారుడిగా కొలువుదీరి రంగనాథుడు, పక్కనే శ్రీ- భూదేవి అమ్మవార్లు

బాప్టిస్ట్ చర్చి స్థల ఆక్రమణ యత్నం

వినుకొండ : పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల బాప్టిస్ట్ చర్చి ఎదురు సాయి ఆసుపత్రి పక్కన సర్వే నంబర్ 396/1లో 40 సెంట్ల చర్చి స్థలాన్ని ఆక్రమించి, అక్రమ కట్టడాలకు ప్రయత్నిస్తున్న ల్యాండ్ మాఫియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. కట్టుబడి జరుగుతున్న స్థలాన్ని వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాప్టిస్ట్ చర్చి ఆస్తుల విషయంలో గతంలో జరిగిన లావాదేవీలన్నీ చెల్లవని తెలిపారు. కొత్తగా ఏర్పడబోయే కమిటీ గతంలో జరిగిన లావాదేవీలపై పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు ప్రకటించిందని చెప్పారు. తమకు అధికార పార్టీ అండ ఉందని ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ సమీపంలో అనుమతులు లేకుండా 40 సెంట్ల స్థలంలో కట్టుబడి కోసం ప్రయత్నించడం తీవ్రమైన చర్యగా పరిగణించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో పీడీఎం జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

పిట్టంబండ మేజరు కాల్వ అభివృద్ధి పనులు



శావల్యాపురం: మండలంలోని అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పిట్టంబండ మేజరు కాల్వ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈ విజయలక్ష్మి మాట్లాడుతూ పిట్టంబండ మేజరు కాల్వ పరిధిలో నాలుగు పనులను గుర్తించగా రూ. 19 లక్షల 84 వేల నిధులతో ముళ్ళకంచె, పిచ్చిచెట్లు, కాల్వలో పూడికతీత తదితర పనులను 9.7 కిలోమీటర్ల మొర చేస్తున్నట్లు వెల్లడించారు. కాల్వ కట్ట పటిష్టంగా ఉండేలా మట్టితొలకం పనులతో పాటు వాహనాలు తిరగడానికి అనుకూలంగా రైతులు ఇబ్బందులు పడకుండా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు మేరకు పనులు పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. డీసీ చైర్మన్ మండలపు వెంకటనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు సారథ్యంలో రైతుల భాగస్వామ్యంతో ఏబీసీ కెనాల్ పరిధిలో ఉన్న మేజరు కాల్వ పనులన్నీ పూర్తి స్థాయిలో జరుగుతాయన్నారు. ఏఈ పోట్లూరి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

సైబరు నేరగాళ్లపై అప్రమత్తత అవసరం

శావల్యాపురం: సైబర్ నేరగాళ్లపై ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడారు. మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన నామినేని పెద సుభానీరావు కూతురుకు అజ్ఞాత వ్యక్తులు ఫోన్ చేసి తెలుగులో మాట్లాడారు. ఆమె బంధువు ఒకరు రూ.10 లక్షల రుణానికి సంబంధించి హామీ సంతకం పెట్టారని, బ్యాంకు ఖాతా సమగ్ర వివరాలు తెలియజేయాలని ఫోన్ ద్వారా ఒత్తిడి చేశారు. వ్యక్తిగత సమాచారం అంతా తమ దగ్గర ఉందని, గత రెండు రోజుల నుంచి బాధితురాలికి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితురాల తండ్రి పెద సుభానీరావు సైబరు నేరగాళ్ల నంబరుకు ఫోన్ చేస్తే దుర్భాషలాడటంతో భయపడి తన బంధువు ముక్కపాటి నాగేశ్వరరావు విషయాన్ని తెలియజేశారు. పోలీసుల సూచనలు మేరకు శావల్యాపురం ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లి లావాదేవీలు నిలుపుదల చేయడంతో నగదు భద్రంగా ఉండటంతో బాధితులు ఊపిరి పిల్చుకున్నారు.

సీహెచ్‌ఓలకు న్యాయం చేయండి

నరసరావుపేట: స్థానిక స్టేషన్‌రోడ్‌లోని గాంధీపార్కుకు ఎదుట తమ డిమాండ్ల సాధనకోసం ప్లకార్డులు ప్రదర్శిస్తూ, సీహెచ్‌ఓలు చేస్తున్న ధర్నా గురువారంతో 11వ రోజుకు చేరింది. ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్ హుమాయున్ భాషా శిబిరాన్ని సందర్శించి తమ సంస్థ పక్షాన సంఘీభావం ప్రకటించారు. ఎస్‌హెచ్‌ఓలో సమ్మెతో గ్రామీణ ఆరోగ్య రంగం దెబ్బతిందని, పేదలందరూ వైద్యసేవలు అందక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్‌హెచ్‌ఓలు కరోనా కాలంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా సాహసోపేత సేవలు అందించారని, ప్రభుత్వం మానవీయ కోణంతో ఆలోచించి తక్షణం సమస్యను పరిష్కరించాలని హితవు పలికారు. ఏఐటీయూసీ నాయకుడు ఉప్పలపాటి రంగయ్య, గాంధేయవాది ఈదర గోపీచంద్ ధర్నాలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.



సీహెచ్‌ఓలకు మద్దతు పలికిన హుమాయూన్ బాషా, గోపీచంద్

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట

సత్తెనపల్లి: మండలంలోని కంకణాలపల్లి గ్రామంలో వీరాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో స్థానిక శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.